క్లుప్తంగా

ఘనంగా శ్రీవేంకటేశ్వర కల్యాణం

వంగర: మండల పరిధి కె.కొత్తవలస గ్రామంలో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఘనంగా శుక్రవారం నిర్వహించారు. వేదపండితులు భోగాపురపు కృష్ణశర్మ, వేమకోటి రమాకాంత్‌శర్మల ఆధ్వర్యంలో ఆలయ నిర్వహకులు పనస రమణనాయుడు, కళావతి దంపతుల సమక్షంలో పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. అంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించారు. అనంతరం భారీ అన్న సమారాధన చేపట్టారు. పరిసర భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ స్థాయి వర్క్‌షాప్‌కు 'అదపాక'



దామోదరరావుకు ఎంపిక పత్రాన్ని అందిస్తున్న హెచ్‌ఎం

సంతకవిటి: రాజస్తాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో ఈ నెల 11 నుంచి 15వ తేదీ వరకు సెంట్రల్ ఫర్ కల్చరల్ రిసోర్స్ అనే కేంద్ర సంస్థ ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ స్థాయి వర్క్‌షాప్‌కు రాష్ట్ర స్థాయిలో ఇద్దరు ఎంపిక కాగా అందులో ఒకరిగా బొద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు అదపాక దామోదరరావు ఎంపికయ్యారు. ఆయనను హెచ్‌ఎం మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

బిల్లుల కోసం నిరీక్షణ

బాడంగి: ఉపాధి పథకం ద్వారా చేపడుతున్న పనులకు బిల్లులు చెల్లింపులు లేక నిర్వాహకులు బిల్లుల కోసం నిరీక్షిస్తున్నారు. పనులు పూర్తయిన వాటికి కూడా సుమారు రెండు నెలలుగా బిల్లులు పడకపోవడంతో అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. డిసెంబరు నెలలో తొలి విడతగా చేసిన సీసీ పనులకు సంక్రాంతి పండగ ముందు సరిపడా బిల్లులు పడినా పండగ తరువాత ఒక్క పైసా కూడా చెల్లించకపోవడంతో ఇంజినీరింగ్ అధికారులపై ఒత్తిడి పెంచుతున్నారు. బిల్లులు ఎప్పుడు వస్తాయోనని అధికార పార్టీకి చెంది పనులు చేసిన వారే విసుక్కుంటున్నారు. తొలి విడతగా సీసీ రోడ్లు, కాల్వల పనులు జరిగినా.. ఆరు డబ్ల్యూబీఎం రోడ్లకు ఏ ఒక్కటి పూర్తి కాలేదు.

వైభవంగా రామమందిర వార్షికోత్సవం



సామూహిక పూజల్లో పాల్గొన్న భక్తులు

బొబ్బిలి రూరల్: మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని రామాలయం ఏడవ వార్షికోత్సవ ఉత్సవాలు ఘనంగా శుక్రవారం నిర్వహించారు. శ్రీరామ పట్టాభిషేకం, సీతారాముల కల్యాణ ఉత్సవాలను సంప్రదాయ బద్ధంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని భక్తులు పాల్గొని సామూహిక ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బొద్దల పద్మ, సత్యనారాయణ దంపతులు, ఎంపీటీసీ రౌతు తిరుపతిరావు దంపతులు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు శివపార్వతుల కల్యాణం

రాజాం: పట్టణంలో మల్లిఖార్జున కాలనీలోని కల్యాణగౌరీ మల్లిఖార్జున స్వామి ఆలయంలో శనివారం భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని అర్చకులు మురపాక ధర్మారావు శర్మ, ధూపం యశ్వంత్ స్వామిలు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలోని పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్నామని అన్నారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు.

సర్వే వేగవంతం చేయాలి



సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

రాజాం: గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న సీనియర్ సిటిజన్ సర్వే, హౌస్ హోల్డ్ సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించారు. మండలంలోని కంచరాం గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. సచివాలయ ఉద్యోగుల హాజరు శాతంపై ఆరా తీశారు. డ్రైడే.. ఫ్రైడేను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ గెద్దాపు సుబ్బమ్మ, పంచాయతీ కార్యదర్శి వెంకటరావు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసర సరుకుల పంపిణీ

వంగర: మండల పరిధి కొప్పరవలస గ్రామంలో శ్రీసత్యసాయి సేవా కమిటీ ద్వారా పేదలకు నిత్యావసర సరుకులు శుక్రవారం పంపిణీ చేశారు. స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు సాదెం వెంకటరమణ ఆధ్వర్యంలో గ్రామంలో పేదలు, దివ్యాంగులు, వృద్ధులకు అమృత కలశం పేరుతో తొమ్మిది రకాల నిత్యావసర సరుకులు అందించారు.

శ్రమ దోపిడీ నేరం



కార్మికులను బంధించి శ్రమను దోచుకోవడం నేరమని, దీనిని ఎక్కడైనా కొనసాగించడం చట్టవిరుద్ధమనీ పార్వతీపురం రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.దామోదర రావు అన్నారు. శుక్రవారం బాండెడ్ లేబర్ నిషేధిత దినం సందర్భంగా బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1976లోనే ఈ విధానాన్ని పూర్తిగా రద్దు చేసినట్టు చెప్పారు. అబాలిషన్ చట్టంగా పిలవబడే దీనిని ఎక్కడైనా అమలు పర్చే సందర్భాలుంటే వారు శిక్షార్హులవుతారని పేర్కొన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోహిణీ రావు, లేబర్ ఆఫీసర్ కె.గౌరీశంకరరావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పీఎంఎం కుమార్, న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు. - బొబ్బిలి

వేడుకగా రామాలయ ప్రతిష్ఠ



వంగర మండల పరిధి కింజంగి ఆర్అండ్ఆర్ కాలనీలో నూతనంగా నిర్మించిన శ్రీకోదండ రామాలయం ప్రతిష్ఠ ఉత్సవాలు రెండో రోజు శుక్రవారం వేడుకగా నిర్వహించారు. కల్పవృక్షములు, శిఖర యంత్రాలను ఊరేగించారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేకంగా పూజలు, క్షీరాభిషేకాలు చేశారు. పూర్ణ కలశాలతో ఊరేగించారు. ప్రధాన అర్చకులు ఆరవెల్లి శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. - వంగర

వెట్టిచాకిరీ నిర్మూలన అందరి బాధ్యత



సమాజంలో వెట్టిచాకిరీ నిర్మూలన అందరి బాధ్యత అని సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. ఈ నెల 9న వెట్టిచాకిరీ నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక కోర్టుల సముదాయంలో వివిధ శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వెట్టిచాకిరీకి పేదరికం, నిరక్షరాస్యత ప్రధాన కారణమని అన్నారు. వెట్టిచాకిరీ చేయించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. అనంతరం కోర్టు ఆవరణ నుంచి మాధవబజార్ వరకు ర్యాలీ నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీజీ కృష్ణసాయితేజ, లేబర్ ఆఫీసర్ ఐ.కొండలరావు, ఎస్సై వై.రవికిరణ్, న్యాయవాదులు పి.శ్రీనివాసరావు, డీజీ ప్రసాద్, ఎస్.జయలక్ష్మి, రెడ్‌క్రాస్, మానవతా సంస్థల ప్రతినిధులు పి.చైతన్యకుమార్, జీవీ అచ్యుత్‌కుమార్, యు.నీలకంఠేశ్వరయాదవ్ తదితరులు పాల్గొన్నారు. - రాజాం సిటీ

పరిష్కారానికి నోచుకోని రెవెన్యూ సమస్యలు



బాడంగి: మండలంలోని రెవెన్యూ సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. రెవెన్యూ సదస్సుల పేరిట అధికారుల హడావుడే తప్ప పరిష్కారానికి నోచుకోవడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గతంలో నిర్వహించిన రీసర్వే, రెవెన్యూ గ్రామ సదస్సుల్లో రైతుల నుంచి స్వీకరించిన సుమారు 1103 దరఖాస్తుల్లో కేవలం కుల, ఆదాయ, కుటుంబ వారసత్వ ధ్రువీకరణ పత్రాల వంటివి సుమారు 250 జారీ చేసి అధికారులు మమ అనిపించారు. ఎల్‌పీఎంల వంటి దరఖాస్తులు ఎటువంటి పరిష్కారానికి నోచుకోలేదు. రెవెన్యూ ఉన్నతాధికారుల ఒత్తిడి మేరకు పరిష్కారం చేయకుండానే చేసినట్టు దరఖాస్తుదారులతో సంతకాలు చేయించుకొని అవి ముగిసిపోయినట్టు చూపించి చేతులు దులిపేసుకుంటున్నారు. ఇప్పటికే 1050 వరకు పరిష్కరించినట్టు కలరింగ్ ఇచ్చి ఆ దరఖాస్తులను ముగించగా.. ఇంకా 500 దరఖాస్తుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్టు తహసీల్దార్‌తో పాటు రీసర్వే డీటీ, ఎంఆర్ఐ, వీఆర్‌ఓలతో కలసి తంతు నడిపిస్తున్నారు. పలు రెవెన్యూ సమస్యలపై కార్యాలయానికి వచ్చే వారికి తీరిక లేదని చెప్పి మళ్లీ రమ్మని పదేపదే తిప్పుతున్నారు. దీంతో సకాలంలో తమ రెవెన్యూ సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు రెవెన్యూ శాఖ తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పనుల్లో మరింత జాప్యం జరుగుతోందని మాటకీ వీసీల పేరిట కాలయాపన చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు తమ సమస్యలు వినిపించుకునే అవకాశం కూడా ఇవ్వడం లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దార్ సుధాకర్ వివరణ కోరగా కార్యాలయానికి వచ్చిన దగ్గర నుంచి తీరిక లేకుండా పని చేస్తున్నామని, మీరే చూస్తున్నారని సమాధానమిచ్చారు. మరోవైపు కార్యాలయ పనుల నిమిత్తం వచ్చే వారు మాత్రం రెవెన్యూ శాఖ అధికారుల తీరుపై ఒకింత పెదవి విరుస్తున్నారు.

ధాన్యం విక్రయాలకు అనుమతివ్వండి



ధాన్యం విక్రయాలకు అనుమతివ్వాలని కోరుతున్న కొరటాం గ్రామ రైతులు

తెర్లాం: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకునేందుకు అనుమతి ఇవ్వాలని మండలంలోని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం ఈ ఏడాది రైతులు పండించిన ధాన్యం కొంతమేరకే కొనుగోలు చేసి లక్ష్యం పూర్తయిందని చెప్పి మిగిలిన ధాన్యం కొనుగోలు చేయడం లేదని మండలంలోని కొరటాం గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎటువంటి కష్టాలు లేకుండా చూస్తామని కూటమి ప్రభుత్వం చెబుతున్న మాటలు ఆచరణలో కనబడడం లేదని వాపోతున్నారు. ఎన్నో కష్టాలు పడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించకపోతే ఎలా అని వారు ప్రశ్నించారు. కొరటాం గ్రామంలో సుమారు 300 టన్నుల పైనే ధాన్యం రైతుల వద్ద ఉందని తెలిపారు. మండలంలోని తెర్లాం, ఆమిటి, నందిగాం తదితర గ్రామాల్లో సుమారు 2వేల టన్నుల ధాన్యం విక్రయించేందుకు సిద్ధంగా ఉందని ఆయా గ్రామాల రైతులు అంటున్నారు. రైతు సేవా కేంద్రాలకు వెళ్తే తమకు అనుమతులు రాలేదని వీఏఏలు అంటున్నారని, తాము పండించిన ధాన్యాన్ని ఎక్కడ విక్రయించాలని రైతులు ప్రశ్నిస్తున్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



ఎంపీడీఓ రత్నంతో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మణరావు

రామభద్రపురం: రానున్న వేసవి దృష్ట్యా మండల పరిధిలోని గ్రామాలలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు అన్నారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన ఎంపీడీఓ రత్నం, ఈఓపీఆర్‌డీ వెంకటరమణతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితో పాటు తాగునీటికి అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. గ్రామాలలో పరిశుభ్రతపై కార్యదర్శులతో ఎప్పటికప్పుడు సమీక్షించాలన్నారు. మైదాన ప్రాంత గ్రామాలతో పాటు గిరిజన గ్రామాలలో సీజనల్ వ్యాధుల సోకి ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా వైద్యాధికారులతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి పారదర్శకంగా జరిగేలా చూడాలని సూచించారు.

రమాభాయి త్యాగమూర్తి

రాజాం సిటీ: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సతీమణి రమాభాయి గొప్ప త్యాగమూర్తి అని బీఎస్పీ రాజాం ఇన్‌చార్జి బి.బుద్ధుడు అన్నారు. స్థానిక బీఎస్పీ కార్యాలయంలో రమాభాయి 127వ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి శుక్రవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన భర్త ఉద్యమానికి పిల్లలను సైతం త్యజించిన త్యాగమూర్తి అని కొనియాడారు. అనంతరం ఆమె జీవిత చరిత్ర పుస్తకావిష్కరణ చేశారు.

కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు జరజాన నీలయ్య, కె.అన్నారావు, టి.మోహన్, ఎస్.తిరుపతిరావు, లక్ష్మి, కీర్తి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

జీడి, మామిడి తోటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

- ఉద్యానవన శాస్త్రవేత్త శ్రీనివాసరాజు



జీడి, మామిడి తోటల సస్యరక్షణ చర్యలు వివరిస్తున్న ఉద్యానవన శాస్త్రవేత్త శ్రీనివాసరాజు

రేగిడి: జీడి, మామిడి తోటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఉద్యానవన శాస్త్రవేత్త ఎస్.శ్రీనివాసరాజు రైతులకు సూచించారు. మండలంలోని నాయిరాలవలస గ్రామంలో ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో జీడి, మామిడి రైతులకు సస్యరక్షణ చర్యలపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రస్తుతం జీడి, మామిడి తోటలకు టీ దోమ, ఆకుముడత తెగుళ్లు వ్యాపిస్తున్నాయని వెల్లడించారు. ఇమిడా 3 గ్రాములు, డయోమిరాక్సిన్ 3 గ్రాములు, కార్బన్‌డైజిమ్ 1 గ్రాము లీటరు నీటిలో కలిపి తోటల కొమ్మలు తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. జీడి, మామిడి తోటల్లో మామిడి పంటను ఎక్కువగా పురుగులు, తెగుళ్లు ఎక్కువగా ఆశిస్తున్నాయని, ఈ సమయంలో పూతకు నష్టం వాటిల్లి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని వెల్లడించారు. తెగుళ్ల బెడద నుంచి రక్షించుకునేందుకు ప్రతీ మామిడికాయకు ఫ్రూట్ కవర్స్‌ను వినియోగించాలని వెల్లడించారు. ఈ కవర్స్ వలన పండ్ల నాణ్యత పెరిగి, మంచి ధర లభిస్తుందని వెల్లడించారు. ఈ ఫ్రూట్ కవర్స్‌కు సంబంధించి ఉద్యానవన శాఖ ద్వారా ఒక్కో కవరుకు రూ.1 రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతీ రైతుకు 2.50 ఎకరాల పంటకు రాయితీ వర్తిస్తుందని వెల్లడించారు. రాజాం ఉద్యానవన శాఖ అధికారిణి ఉమామహేశ్వరి, ఏఓ జి.మురళీకృష్ణ, సర్పంచ్ కొవ్వాడ కళ, ఏఈఓ లీలామోహన్, వీహెచ్ఏ అసిరినాయుడు, వావిలపల్లి క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- డీఎల్‌డీఓ కిరణ్‌కుమార్



పంచాయతీ కార్యదర్శి పార్వతిని ప్రశ్నిస్తున్న డీఎల్‌డీఓ

బొబ్బిలి రూరల్: సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో కూర్చుని కాలవ వెళ్లదీస్తే ప్రభుత్వం అప్పగించిన పనులను ఎవరు పూర్తి చేస్తారని, నిర్దేశించిన పనులను పూర్తి చేయకుంటే చర్యలు తప్పవని డీఎల్‌డీఓ కిరణ్‌కుమార్ సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. మండలంలోని దిబ్బగుడ్డివలస గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఎంపీడీఓ పప్పు రవికుమార్‌తో కలసి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. జియో కో ఆర్డినేట్ ట్యాగింగ్ సర్వేలో పురోగతి లేదని, ఇంకా 169 ఇళ్లు పెండింగ్‌లో ఉండటాన్ని ఆయన అసహనం వ్యక్తం చేశారు. ఇన్నాళ్లుగా ఏమి చేస్తున్నారని, అన్నీ సచివాలయాల్లో పూర్తి చేశారని, ఇక్కడ ఎందుకు పూర్తి కాలేదని సాయంత్రంలోగా పూర్తి చేయకుంటే అందరిపైన చర్యలుంటాయని హెచ్చరించారు. పెండింగ్‌లో ఉన్న మిస్సింగ్ సిటిజన్, ఆరోగ్యశ్రీ, రికార్డులు ఉపాధి హామీ రికార్డులన్నీ పెండింగ్‌లో ఉండటాన్ని గమనించి సకాలంలో పూర్తి చేయకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిర్లక్ష్యం,అలసత్వాలను వీడాలని సూచించారు. ఆయన వెంట సచివాలయాల జిల్లా కో ఆర్డినేటర్, పంచాయితీ కార్యదర్శి పార్వతి సిబ్బంది ఉన్నారు.

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం



వన్నలిలో వైద్య సేవలు

రేగిడి:

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సోహినీరాఘవ్ అన్నారు. మండలంలో వన్నలి గ్రామంలో 104 ద్వారా ప్రజలకు వైద్యసేవలను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలకు కేటాయించిన సంబంధిత వారాల్లోనే 104 వస్తుందని, 14 రకాల రోగ నిర్ధారణ పరీక్షలతో పాటు 64 రకాల మందులు అందిస్తున్నామని వెల్లడించారు. ప్రజలు ఈ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. ఎమ్ఎల్‌హెచ్‌పీ ప్రియ, ఏఎన్ఎం రాజేశ్వరి, సర్పంచ్ గార రమణ, ఆశా వర్కర్లు రాములమ్మ, సావిత్రి, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో వైద్యసేవలతో రోగులకు మేలు

మెంటాడ: రోగులకు పీహెచ్‌సీ వైద్యాధికారులు నిరంతరం అందుబాటులో ఉంటూ వైద్య సేవలకు ఎటువంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.భానుమూర్తి చల్లపేట, మెంటాడ పీహెచ్‌సీ వైద్యులకు సూచించారు. రోగులు అత్యవసర పరిస్థితుల్లో ఎప్పుడు వచ్చినా వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వైద్య సేవలను అందించాలని సూచించారు. వైద్య సేవల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు లోకప్రియ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై చర్యలకు డిమాండ్

రేగిడి : గజపతినగరం మండలం తహసీల్దార్‌పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని రాజాం నియోజకవర్గం బీసీ సెల్ అధ్యక్షుడు కరణం శ్రీనివాసరావు శుక్రవారం డిమాండ్ చేశారు. స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై సర్పంచ్ అధికారులను అడిగేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్తే అక్కడి తహసీల్దార్ ప్రజాప్రతినిధిగా ఉన్న సర్పంచ్‌పై దురుసుగా మాట్లాడడం రాజ్యాంగ హక్కులను, సర్పంచ్ విధులను కాలరాసినట్టేనని వెల్లడించారు. ప్రజల సొమ్మును జీతాలుగా తీసుకుంటున్న అధికారులు ప్రజాప్రతినిధుల మాటలను తిరస్కరించడం సిగ్గుచేటుగా ఉందని పేర్కొన్నారు. ఈ ఘటనపై సంబంధిత తహసీల్దార్‌పై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని, లేకుంటే న్యాయపోరాటం చేస్తామని హెచ్చరించారు.

కృష్ణరామకోటి ఆలయ ప్రతిష్ఠ



శ్రీకృష్ణునికి పూజలు చేస్తున్న భక్తులు

రాజాం సిటీ: మున్సిపాల్టీ పరిధి బుచ్చెంపేట గ్రామంలో శుక్రవారం శ్రీకృష్ణ రామకోటి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. ఆలయంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించడంతో పాటు ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

అందరికీ వైద్య సేవలు అందాలి

బొబ్బిలి: పేద, మధ్య తరగతి ప్రజలందరికీ వైద్య సేవలు అందజేయాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని ప్రధాన రహదారిలో శ్రీ వెంకటేశ్వర జనరల్, కార్డియాలజీ ఆస్పత్రిని ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఎంపీపీ శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, డాక్టర్ వై.మాధవనాయుడు, డాక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి దివ్యాంగుల పింఛన్ల పరిశీలన

బాడంగి: దివ్యాంగుల పింఛన్లకు సంబంధించి ఈ నెల 11 నుంచి జూన్ 9 వరకు పరిశీలనలు జరగనున్నట్టు ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 1101 మంది దివ్యాంగ పింఛన్‌దారులు ఉన్నారని తెలిపారు. కంటికి సంబంధించి 255 మంది ఉండగా వీరికి రాజాం ఏరియా ఆస్పత్రిలో ఈ నెల 11 నుంచి 24 వరకు వెరిఫికేషన్ ఉంటుందన్నారు. వినికిడికి చెందిన పింఛన్‌దారులు 222 ఉండగా వీరికి మార్చి 19 నుంచి ఏప్రిల్ 2 వరకు విజయనగరం జనరల్ ఆస్పత్రిలో వెరిఫికేషన్ ఉంటుందన్నారు. మెంటల్ ఇల్నెస్‌కు చెందిన 39 మందికి ఏప్రిల్ 17న విజయనగరం జనరల్ ఆస్పత్రిలో వెరిఫికేషన్ జరుగుతుందన్నారు. మెంటల్ రిటార్డేషన్ పింఛన్లు 102 ఉండగా వీరికి మార్చి 18, 19 తేదీల్లో విజయనగరంలోని జనరల్ ఆస్పత్రిలో, లోకో మోటార్ హ్యాండీకాప్డ్‌కు చెందిన 486 మంది పింఛన్‌దారులుండగా వీరికి మార్చి 19నుంచి జూన్ 9వ తేదీ వరకు రాజాం ఏరియా ఆస్పత్రిలో వెరిఫికేషన్ ఉంటుందన్నారు.

పన్ను వసూళ్లపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి



సిబ్బందినుద్దేశించి మాట్లాడుతున్న కమిషనర్ రామలక్ష్మి

బొబ్బిలి: పట్టణంలోని 31 వార్డుల్లో ఇంటి పన్ను, తాగునీటి పన్నులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి లక్ష్యాలను సాధించాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో అన్ని సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, రెవెన్యూ అధికారులతో జీఐఎస్ సర్వే, ఇంటి పన్నులు, కుళాయి పన్నులు, ఖాళీ స్థలాల పన్నులపై సచివాలయాల వారీగా లక్ష్యాలు, వసూళ్లపై శుక్రవారం ఆరా తీశారు. వ్యక్తిగతంగా ఆయా వసూళ్ల శాతాన్ని తీసుకుని మళ్లీ లక్ష్యాలను విధించారు. వారందరికీ రోజువారీ లక్ష్యాలను విధించారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఎక్కువ రోజులు లేనందున త్వరితగతిన వసూళ్లు చేపట్టాలన్నారు. మున్సిపల్ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకునేందుకు ఉపయోగపడే జీఐఎస్ సర్వేను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఆర్వో ఎంవీ నాగరాజు, సెక్రటరీలు పాల్గొన్నారు.

సంఘాల మహిళలు నెలకు రూ.200 పొదుపు చేయాలి



మహిళలకు సూచనలిస్తున్న ఏసీ చిరంజీవి

రేగిడి: గ్రామైక్య సంఘాల్లోని మహిళలు ఇప్పటి నుంచే ప్రతీ నెల రూ.200లు పొదుపు చేసుకోవాలని వెలుగు ఏసీ ఎ.చిరంజీవి సంఘాల సభ్యులకు సూచించారు. మండలంలోని కె.వెంకటాపురం గ్రామంలో స్వయంశక్తి సంఘాల మహిళలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీ మాట్లాడుతూ ప్రతీ సంఘం నుంచి గ్రామ సంఘానికి రూ.500లు పొదుపు చేయాలని, సంఘ సభ్యులు తీసుకున్న బ్యాంకు లింకేజీ, ఉన్నతి రుణాలను జీవనోపాధి కార్యక్రమాలు ఏర్పాటుకు, ఆదాయాభివృద్ధిని పెంపొందించుకోవాలని సూచించారు. శతశాతం రికవరీ ఉండేట్టు చూడాలని ఏపీఎం గోవిందరావు సీసీలకు, సీఎఫ్‌లకు సూచించారు. సంఘాల మహిళలు సమావేశాలు ఏర్పాటు చేసుకుని, పొదుపులు, అంతర్గత నిర్వహణ, రికవరీ, పుస్తక నిర్వహణ సక్రమంగా ఉండేట్టు చూడాలని వెల్లడించారు. కార్యక్రమంలో ఫైనాన్స్ ఏపీఎం కె.హేమలత, సీసీ వెంకటరావు, సంఘాల మహిళలు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకుంటే చర్యలు



సీతారాంపురం పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంఈఓ

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న మరుగుదొడ్లు పరిశుభ్రంగా లేకపోతే సంబంధిత పాఠశాలల స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకునేందుకు వెనుకాడేది లేదని ఎంఈఓ జె.త్రినాధరావు అన్నారు. మండలంలోని సీతారాంపురం పాఠశాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మరుగుదొడ్లను ఆయన పరిశీలించి మరుగుదొడ్లు పరిశుభ్రంగా, విద్యార్థులు వినియోగించే విధంగా ఉండాలని, లేదంటే స్కావెంజర్స్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మధ్యాహ్న భోజన పథకంలో మెనూ తప్పనిసరిగా అమలు చేయాలని, విద్యార్థులకు రుచి, శుచికరమైన భోజనాలు వండి పెట్టాలని నిర్వాహకులకు తెలియజేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను మరింత మెరుగుపరచాలని, ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

భూసార పరీక్షలతో మేలు



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారి

రేగిడి: భూసార పరీక్షలతో ఎరువుల వినియోగం తగ్గించుకోవచ్చునని వ్యవసాయ శాఖ అధికారి జి.మురళీకృష్ణ సూచించారు. మండలంలో కోడిశ గ్రామంలో రైతుమిత్రలతో కలసి మట్టినమూనాల సేకరణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. యాంత్రీకరణ ఉపకరణాలు వినియోగంతో పాటు లాభాలపై అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా తగిన మోతాదులో మాత్రమే ఎరువులు వినియోగించుకోవచ్చునని తెలిపారు. ఈ సంవత్సరం ఆర్‌బీకేల ద్వారా మట్టి నమూనాలు సేకరణ చేసి, రైతులకు మేలు చేస్తాయని తెలిపారు. సిబ్బంది శరత్‌బాబు, బి.సూర్యనారాయణ, సాయిమణికంఠ, రైతులు పాల్గొన్నారు.